
# ప్రజల కోసం ఉంచిన స్థలం...
# ఎవరి సొంతమైంది?



నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 117 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
06-03-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4

- పి.ఎన్ కాలనీ రిజర్వ్ సైట్‌లో అక్రమ నిర్మాణాలా.??
- ఓపెన్ స్పేస్‌పై ఖాళీ స్థలం పన్ను విధింపుపై ఆశ్చర్యం?
- మున్సిపల్ అధికారుల పాత్రపై అనుమానాలు??
- విచారణ జరిపించాలని కాలనీ వాసుల డిమాండ్




**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణంలోని పి.ఎన్ కాలనీలో ప్రజల కోసం ఉంచిన ఓపెన్ స్పేస్ ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువుగా మారింది. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలో భాగంగా రిజర్వ్ సైట్ గా ఉంచిన స్థలం అక్రమ నిర్మాణాల బారిన పడిందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.
పట్టణంలోని పి.ఎన్ కాలనీ ఆరో లైన్‌లో ఉన్న LP No.577/1983కు చెందిన రిజర్వ్ సైట్ (ఓపెన్ స్పేస్) పై కొంతమంది వ్యక్తులు కన్ను వేసి కబ్జా చేసి ఇల్లు నిర్మాణం చేపడుతున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీ ప్రజల కోసం, ముఖ్యంగా పిల్లలు ఆడుకోవడానికి, వృద్ధులు విశ్రాంతి తీసుకోవడానికి, సామూహిక అవసరాల కోసం ఉంచిన ఈ స్థలాన్ని కొందరు తమ సొంతంగా భావించి నిర్మాణం ప్రారంభించడం స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.
స్థానికుల కథనం మేరకు ఈ నిర్మాణం సాధారణంగా జరగలేదని, మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై వ్యవహారం సర్దుబాటు చేసుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.. రిజర్వ్ సైట్‌గా నమోదు చేసిన స్థలంలో ఎటువంటి వ్యక్తిగత నిర్మాణాలకు అనుమతి ఉండకూడదంటున్నారు.
ఇక ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం బయటపడింది. రిజర్వ్ సైట్‌గా ఉన్న ఈ స్థలంపై ఖాళీ స్థలం పన్ను (Vacant Land Tax) విధించబడినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా ఈ పన్ను కబ్జాదారుల పేర్లతో విధించబడిందని స్థానికులు చెబుతున్నారు. రిజర్వ్ సైట్‌గా ఉన్న స్థలంపై పన్ను ఎలా విధించారు? ఆ పేర్లతో రికార్డులు ఎలా నమోదు అయ్యాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు మున్సిపల్ అధికారుల ముందు నిలిచాయి.
కాలనీలలో ప్రజల కోసం ఉంచిన ఓపెన్ స్పేస్‌లు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఒకసారి ఈ స్థలాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతే భవిష్యత్ తరాలకు అవసరమైన ప్రజా వసతులు లేకుండా పోతాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రిజర్వ్ సైట్‌పై జరుగుతున్న నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, ఇందులో పాలుపంచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల కోసం ఉంచిన స్థలాలు నిజంగా ప్రజలకే అందుబాటులో ఉండాలా... లేక కొందరి చేతుల్లోకి వెళ్లిపోవాలా... అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు సంబంధిత అధికారుల ముందుంది.

## మండలి చైర్మన్‌పై మంత్రి వ్యాఖ్యలు గర్హనీయం

### ధర్మాన కృష్ణదాస్



**నవతరం -నరసన్నపేట**

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనమండలి చైర్మన్‌ను కులమతాల పేరుతో దూషించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి అచ్చెన్నాయుడు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని మండిపడ్డారు. సభను హుందాగా నడపాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కృష్ణదాస్ విమర్శించారు.
"ఒక గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వ్యక్తికి మతాన్ని ఆపాదించి, ఆయన తానూ క్రిస్టియన్‌ను కాదని చెప్పుకోవాల్సిన దుస్థితి కల్పించడం సిగ్గుచేటు. ఇది కేవలం చైర్మన్ వ్యక్తిగత గౌరవానికే కాదు, మొత్తం సభా మర్యాదకే భంగకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెరిటేజ్ అవినీతి అంశాలు, కల్తీ నెయ్యి సరఫరా వంటి కీలక విషయాల్లో తెలుగుదేశం పార్టీ బండారం బయటపడుతుందనే భయంతోనే అచ్చెన్నాయుడు ఇలాంటి చిల్లర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కులమతాల ప్రస్తావన తెస్తున్నారని దుయ్యబట్టారు.

## ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే
- పంటల భీమాలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది
- అరకు కాఫీ తోటల్లో 'కాఫీ బెర్రీ బోరర్' వ్యాధిపై తక్షణ చర్యలు... రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**నవతరం -అమరావతి**



ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం,అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి శాసన మండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## పైల మోహన్‌రావు హత్య మిస్టరీ ఛేదించిన పోలీసులు



- సాంకేతిక ఆధారాలతో నిందితుల అరెస్టు
- హయాతినగర్‌కు చెందిన డిల్లీశ్వరరావు అరెస్ట్
- డీఎస్పీ వివేకానంద వివరాలు వెల్లడి
- కీలక పాత్ర పోషించిన సీఐ, ఎస్ఐలకు అభినందనలు

2లో

ఎడిటోరియల్

# అమెరికా రక్తచరిత్ర!

ఇలాంటి పచ్చి రక్తం తాగే గోముఖవ్యాఘ్రానికా నన్ను కట్టబెట్టమని కోరింది అంటూ నోబెల్ శాంతి బహుమతి విలవిల్లాడుతోంది. అనేక యుద్ధాలను నివారించిన తనకు శాంతి బహుమతి ఇవ్వలేదని అలిగిన ట్రంప్ నిజస్వరూపం ఇరాన్ అధినేత అయాతుల్లా అలీ ఖమేనీ హత్యతో లోకానికి బహిర్గతమైంది. అమెరికా వైట్‌హౌస్‌లో ఎవరున్నా ఎక్కడో అక్కడ రక్తంతో చేతులు తడుపుకున్నవారే. తమకు లొంగని లేదా నచ్చని విదేశీ నేతలను హతమార్చటంలో అమెరికాకు పెట్టింది పేరు. అది ఒక నిరంతర కార్యక్రమంగా పెట్టుకున్నారు. అడ్డుకొనేవారు లేకపోవటంతో ఒకదాని తరువాత ఒకటిగా కొనసాగిస్తున్నారు. న్యాయం తరఫున ఉంటామని రొమ్ము విరుచుకొని చెప్పుకొనే మన పాలకులు మదురో కిడ్నాప్‌ను తప్పనలేదు, ఖమేనీ హత్య అన్యాయమని చెప్పలేదు. ప్రపంచంలో నరేంద్రమోడీకి ఉన్నంత పలుకుబడి మరేనేతకు లేదని సర్వేలు చెబుతున్నాయంటారు. మరి యుద్ధాల నివారణకు దాన్ని ఉపయోగించరేం? శాంతియుతంగా పరిష్కరించుకోండనే బాబాల సూక్తులు ఎవరైనా చెబుతారు, అఫ్‌కోర్స్ అలాంటి వాటిని పూచికపుల్ల మాదిరిగా తీసివేస్తారనుకోండి. నరేంద్రమోడీ మాటలకూ అదే పరిస్థితి.

ప్రత్యర్థులను కుట్రచేసి హతమార్చటం పురాతన కాలం నుంచీ ఉన్నదే. క్రీస్తు పూర్వం రోమన్ చక్రవర్తి, నియంత జూలియస్ సీజర్‌ను అతని అనుయాయులే కుట్ర చేసి హత్య చేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న అనేక మంది కుట్రలకు బలయ్యారు. వర్తమానానికి వస్తే గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలో అక్కడా ఇక్కడా అని లేకుండా ప్రతి ఖండంలో సిఐఏ ద్వారా దొంగచాటుగా లేదా అంతర్గతంగా మిలిటరీ తిరుగుబాట్లను ప్రోత్సహించి అనేక మందిని పొట్టనపెట్టుకున్న అమెరికా ఇటీవలి కాలంలో వాటితో పాటు బహిరంగంగా దాడులకు దిగి హతమారుస్తున్నది. పశ్చిమాసియాలో దాని తొత్తుగా ఉన్న ఇజ్రాయిల్ అమెరికా సిఐఏ మాదిరి మొసాద్ అనే సంస్థద్వారా పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యంలో హత్యలకు చిరునామాగా మారింది. హత్యలు అమెరికా తన విదేశాంగ విధానంలో భాగంగా చేసుకున్నది. ఐక్యరాజ్యసమితి, ప్రజాస్వామ్యన్నా లెక్కలేదు, చివరికి స్వంతపౌరులు వ్యతిరేకిస్తున్నప్పటికీ అలాంటి దుర్మార్గాలను కొనసాగిస్తున్నది.

అనేక ఉదంతాలను చూసిన తర్వాత ఐరోపాలో నాటి సామ్రాజ్య వాదదేశాలు 1648లో వెస్ట్‌ఫాలియా ఒప్పందం చేసుకున్నాయి. దానిలో ఒక ముఖ్య అంశం ఇతర దేశాల వ్యవహా రాల్లో ఏ దేశమూ వేలు పెట్టకూడదు. ఆ మేరకు అంగీకారానికి వచ్చాయి గానీ తరువాత జరిగిన చరిత్ర అంతా దానికి విరుద్ధమే. అందుకే అనేక యుద్ధాలు జరిగాయి. అదే మాదిరి అమెరికా కూడా స్వయంగా అనేక ఆంక్షలు విధించుకుంది. అయితే పాము తనపిల్లలను తానే తింటున్నట్లుగా అది కూడా వాటన్నింటికీ తిలోదకాలిచ్చింది. తన దారికి రాని, వ్యతిరేకించే అనేక మంది దేశాధినేతలను కుట్ర చేసి హత మార్చింది. అంతర్జాతీయంగా రక్షణ ఉన్న వారిని ఏ కారణంతోనైనా హత్య లేదా గాయపరచటం గానీ నేరపూరితంగా పరిగణిస్తూ 1973లో న్యూయార్క్ సదస్సు నిర్ణయించింది. దాని ప్రకారం తాజాగా ఇరాన్ అధినేత ఖమేనీ హత్యానేరంపై డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహు వారికి మద్దతిచ్చిన దేశాల నేతలను విచారించాల్సిందే. న్యూయార్క్ సదస్సులో భాగస్వామిగా ఉన్న అమెరికా బాహాటంగా ఉల్లంఘించి ఇరాక్‌లో సద్దామ్ హుస్సేన్, లిబియాలో మహమ్మద్ గఢాఫీని హతమార్చింది. అమెరికా చెప్పే ప్రజాస్వామ్యం, మానవత్వం ఒక మేడిపండు. ప్రపంచ చరిత్రలో నిరాయుధులైన పిల్లలు, పెద్దలు ఎవరైనా మరొక దేశానికి హాని కలిగించిన ఉదంతం ఉందా? ఆత్మరక్షణ, సాయుధబృందాలను అడ్డుకొనేపేరుతో గాజాలో వేలాది మంది పిల్లలను ఊచకోత కోసినా, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, చివరికి ఐరాస సహాయ శిబిరాలను కూడా కూల్చివేసిన ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని నిస్సిగ్గుగా సమర్ధించింది. కానీ, నివారించటానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు, భద్రతా మండలిలో దాని మారణకాండను కూడా మద్దతిచ్చింది. బ్రిటన్ వలసగా ఉన్న అమెరికా పోరాటంతోనే 1776లో విముక్తి పొందింది. దాని స్వాతంత్ర్య ప్రకటనలో వల్లించిన వాటన్నింటికీ తిలోదకాలిచ్చి ఇతర దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాలను హరించే దుర్మార్గానికి పాల్పడుతున్నది. ఇరాన్‌పై దాడికి తమ స్థావరాలను వినియోగించుకోవచ్చని బ్రిటన్ చెప్పిందంటే అమెరికా విదిల్చే ఎముకల కోసం నక్కలా అది ఎలా వెంపర్లాడుతోందో అర్ధమవుతోంది. ఇతర దేశాల నేతలను మట్టుబెట్టేందుకు సిఐఏ, ఎన్ఐఏ, ఎఫ్‌బిఐ, ఐఆర్ఎస్ వంటి సంస్థల దుర్వినియోగంపై విమర్శలు వెల్లువెత్తాయి. విధిలేక 1975లో సెనెటర్ ఫ్రాంక్ చర్చ్ అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. ఇతర దేశాల నేతలను హత్య కావించటం అమెరికా విలువలకే వ్యతిరేకమని సదరు కమిటీ చెప్పింది. హత్యాకాండను అధ్యక్షుడు ఫోర్డ్ నిషేధించాడు. అయితే ఇప్పటికీ కాగితాల మీద అవన్నీ ఉన్నప్పటికీ ఏదో ఒకసాకుతో ఉల్లంఘిస్తున్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేకులను అణచివేస్తున్నాడనే పేరుతో ఖమేనీని హత్య చేస్తామని, పాలకుడిగా తొలగిస్తామని ట్రంప్ చెప్పటం ఉల్లంఘనలో భాగమే. అందువలన ఏ విధంగా చూసినప్పటికీ ఖమేనీ హత్యను అందరూ నిరసించాలి. ఖండించని వారంతా అలాంటి దుర్మార్గాలను బలపరిచినట్లే. అది నరేంద్రమోడీ అయినా మరొకరైనా వర్తించేదదే!

# పువ్వు చేతిలో – ప్రేమ హృదయంలో



నీ చేతిలో ఉంటే ఆ పువ్వు
ఎంత అందంగ ఉందో
నీ నవ్వుతో నా మనసుకు
అంత ఆనందంగుంది.
నీ చల్లని చూపు చేరుట
వల్లనో లేక
సుతిమెత్తని స్పర్శ వల్లనో

పువ్వు పట్టి నిలచినా
నువ్వు నన్ను తలచినట్టే ,
తోటలో తిరుగుతున్నా
నా భావన నన్ను వలచినట్టే.

నీ జడలో పూల సువాసన
నా మనసును కవ్విస్తుంటే ,
నీవు నీలి చీరకట్టి నడచిన
నెమలినై నేను పరవసించినట్టే.

నీ నుదిటి బొట్టు నాకు తొలిపొద్దు
నీ కంటి కాటుక తాకు నీలిమబ్బు
నీ ఓర చూపు తోచు లేడిరూపు
నీ మాటలు చేర్చు ప్రేమతోపు.

పూలతో పాటు నా వలపు
తలపు నీ కోసమే
పాలనవ్వుతో పాటు మురిపెపు
ముద్దులు నీ కోసమే
మనసులతో మన మేళవింపు
మమతల మన జీవితం కోసమే.



తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
రత్న లహరి ఛానల్ సీఈవో
9297109223 సికింద్రాబాద్

# 8న 'అస్మిత' క్రీడా పోటీలు


## ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లకు అవకాశం

(నవతరం శ్రీకాకుళం)

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో 'అస్మిత' అథ్లెటిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ (మేరా యువ భారత్), జిల్లా యంత్రాంగం, జిల్లా క్రీడా సాధికారిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి.

**పోటీల వివరాలు:**

మార్చి 8న ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ క్రీడల్లో మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయి.




ఈవెంట్స్: 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంతో పాటు టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట), ఫన్ గేమ్స్ నిర్వహించనున్నారు. వయో పరిమితి: 13 ఏళ్ల లోపు వారు, 13–18 ఏళ్ల లోపు వారు, 18 ఏళ్లు పైబడిన యువతులు/మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. రిజిస్ట్రేషన్ ఇలా..ఆసక్తి గల క్రీడాకారిణులు nsrs.kheloindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పాల్గొన్న వారందరికీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఆన్‌లైన్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేస్తారు. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు మెడల్స్ ప్రధానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని అర్హులైన బాలికలు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నిజజీవిత నిత్య సత్యాలు...



ఓ హితులారా..!
నా ఆప్త మిత్రులారా..!!
నిత్య సత్యమైన చక్కని
సూక్తులను ఆలకించండి...
విజ్ఞతగల మనసుతో
వినయంగా స్వీకరించండి...

నేడు మీరు ఆర్జించిన
ఈ కీర్తి ప్రతిష్టలు...
ఆ నీలాల నింగిలో
మెరిసే మెరుపు తీగలు...

మీరు అనుభవిస్తున్న
ఈ ఉన్నత అధికారాలు...
ఎడారిలో ఎండమావిలో
కనిపించే నీటి తరగలు...

మీ తలపై ధరించిన
ఈ వైభవ కిరీటాలు...
మిమ్మల్ని వరించిన
ఈ అఖండ విజయాలు...
సూర్యాస్తమయం వేళ
మాయమయ్యే నీలినీడలు...

రేపు కాలగర్భంలో ఇవన్నీ
కనుమరుగవ్వక తప్పదు...

కానీ...
సాత్విక హృదయంతో
మీరు చేసే ఈ దానధర్మాలు...
మట్టిలో పూడ్చినా
మళ్ళీ మొలకెత్తే విత్తనాలు...

ఆపదలో ఉన్న
అనాథలకు...
ఆకలితో ఉన్న
అభాగ్యులకు...
మీ అమృత
హస్తాలతో
అందించే ఈ
చిరుసాయం...
చరిత్ర పుటలలో
సువర్ణాక్షరాలతో
లిఖితం...
నింగిలో
ధృవతారగా
నిత్యం కాంతులు
విరజిమ్ము...

అందుకే ఓ
మిత్రులారా..!
నిస్వార్థమైన
నిష్కల్మషమైన
మీ అంతరంగాన
శత్రుత్వపు
కలుపు మొక్కలను
తుంచి వేయండి...

దాతృత్వపు
కల్పవృక్షాలను నాటండి...
ప్రేమతత్వాన్ని
శ్వాసగా మలచుకోండి...
మానవత్వపు పరిమళంతో
ఈ లోకం నుండి
నిష్క్రమించండి...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

## ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రభుత్వం చర్యలు

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ. 12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ. 17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ. 12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ. 25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ. 370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ. 25 కోట్లు, రూ. 34 కోట్లు, రూ. 310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## పంటల భీమా వ్యవస్థపై వివరణ

పంటల భీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి పసల్ భీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత భీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు భీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ. 2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు.

## అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణ చర్యలు

అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు.

# పైల మోహన్‌రావు హత్య మిస్టరీ ఛేదించిన పోలీసులు

నవతరం –శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీకి చెందిన పైల మోహన్‌రావు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి గురువారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. గత నెల 26న పైల మోహన్‌రావు హత్యకు గురికావడంతో అతడి భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో శ్రీకాకుళం నగరంలోని హయాతినగర్‌కు చెందిన అలబోయిన డిల్లీశ్వరరావు ఈ హత్యకు పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సీఐ అవతారం, ఎస్ఐ లక్ష్మణరావు మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# తెలంగాణ రాష్ట్రంసూర్యాపేట జిల్లాలోని......
# పురాతన ఆలయాల అద్భుత శిల్పకళా వైభవం




పిల్లలమర్రి ఆ పేరు వింటేనే చారిత్రక కట్టడాలు గుర్తుకువస్తాయి. ప్రసిద్ధ తెలుగు కవి పిల్లలమర్రి పినవీరభద్రుడు జన్మించిన స్థలం ఇది. ఆధ్యాత్మిక భావం ఉప్పొంగుతుంది. ఇక్కడ కాకతీయుల కాలంలో నిర్మించిన నామేశ్వర, ఎఱకేశ్వర దేవాలయాలు దశాబ్దాలు దాటినా నేటికీ శిల్పకళా సంపద చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచాయి. గొప్ప కళాకృతుల సౌందర్యం ఉట్టిపడే ఈ ఆలయాలకు నేడు ఆదరణ కరువైంది. పాలకులు పట్టించుకోకపోవడంతో భావితరాలకు అందించాల్సిన ఆధ్యాత్మక సంపదకు రక్షణ లేకుండాపోయింది.

మహబూబ్ నగర్ లో చూడవలసిన అత్యంత ఆసక్తికరమైన స్థలం పిలాలయాలరి అనే ప్రసిద్ధ మర్రి చెట్టు, ఇది పట్టణానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. చెట్టు క్రింద ముస్లిం సెయింట్ యొక్క సమాధి ఉంది. 700 ఏళ్ల మర్రి వృక్షం పరిమాణములో భారతదేశంలోని మూడవది. ఈ చెట్టును దూరం నుంచి చూస్తే దట్టమైన చెట్లతో నిండి ఉన్న చిన్న కొండలా ఉంటుంది. దగ్గరికి వెళ్లి చూస్తే 1000 మందికి నీడనిచ్చే పెద్ద గొడుగుల కనిపిస్తుంది.దీని శాఖలు 3 ఎకరాల విస్తీర్ణం. తెలుగులో, "పిల్లులు" అంటే పిల్లలు మరియు "మర్రి" అనగా మర్రి చెట్టు అని అర్థం. పిల్లల మర్రిని చూడడం నిజంగానే అద్భుత అనుభవం. వందల సంవత్సరాల నుంచి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నిలబడి ఇది మహావృక్షం అయింది. ఈ చెట్టు యొక్క ప్రధాన కాండం ఎక్కడుందో చెప్పడం కష్టం దీని పుట్టుకకు సంబంధించిన ఆధారాలు కూడా లేవు.

సూర్యాపేట (తెలంగాణ రాష్ట్రం) లోని పిల్లలమర్రి ఆలయం దాదాపు 1000 సంవత్సరాల నా-టిది మరియు ఇది పురాతన పురాతన దేవాలయాలలో ఒకటిగా పరిగణించబడుతుంది.

శివుడికి అంకితం చేయబడిన ఇది సూర్యాపేట పట్టణంలోని పిల్లలమర్రి గ్రామంలో ఉంది. తెలంగాణ ముఖద్వారంగా చారిత్రాత్మకంగా ముఖ్యమైన సూర్యాపేట పట్టణం హైదరాబాద్ మరియు విజయవాడ మధ్య జాతీయ రహదారిపై ఉంది.

పిల్లలమర్రి ఆలయంతో పాటు, ఈ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక ఇతర పురాతన దేవాలయాలు కూడా ఉన్నాయి. ఇది గ్రామం యొక్క చారిత్రక మరియు మతపరమైన విలువను పెంచడానికి సహాయపడుతుంది.

మూసీ నది ఒడ్డున నిర్మించబడిన ఈ ఆలయం కాకతీయుల కాలం నాటిది మరియు కాకతీయ పాలకుల నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. దీనిలో అందంగా చెక్కబడిన స్తంభాలు మరియు గోడలు ఉన్నాయి, ఇక్కడ ప్రతి క్లిష్టమైన శిల్పం రాతితో కవిత్వంలా ఉంటుంది. ఆలయ గోడలను అలంకరించడానికి అందమైన చిత్రాలు కూడా కనిపిస్తాయి. ఒక గొప్ప మరియు రాజవంశ నంది ఎద్దు దాని ద్వారాలను అలంక-రించడం కనిపిస్తుంది. కాకతీయ కాలం నాటి కళాకారులు తెలంగాణ కళ మరియు సంస్కృతిపై అందించగలిగిన శ్రేష్ఠతకు వాస్తుశిల్పంలోని వివరాలు సూచన.

ఈ ఆలయ ప్రధాన గర్భగుడిలో ప్రధాన దైవం చెన్నకేశవ స్వామి విగ్రహం ఉంది. ఉత్సవాల సమయంలో ఈ విగ్రహం అలంకరణతో శోభిస్తుంది. ఆలయ గూడెం కాకతీయ రాజుల పాలనను అందంగా మరియు విస్తృతంగా వివరించే కొద్దీయ చిత్రాలు మరియు శాసనాలతో నిండి ఉన్నాయి. సంబంధిత శాసనాలలో కొన్ని తెలుగులోని రాతిశాసనం ఉన్నాయి. ఇది శ. 1130 క్రీస్తుశకం 1208 నాటిది. ఈ శాసనం గణపతి దేవుడిని సూచిస్తుంది. రుద్ర దేవుడి పాలన గురించి ప్రస్తావించే శ. 1117 క్రీ.శకం 1195 నాటి మరో రాతి శాసనం ఇక్కడ ఉంది.

ఈ రెండు శాసనాలు పర్యాటకులకు వీక్షించడానికి అందుబాటులో ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో విలువైన శాసనాలు ఉండటం పాటు నాణేలు కనబడడం ద్వారా ఈ ప్రదేశం యొక్క చారిత్రక ప్రాముఖ్యత గణనీయంగా పెరిగింది ఇవి గొప్ప కాకతీయ పాలకుల జీవితం మరియు కాలాల గురించి చరిత్రకారుడు చాలా తెలుసుకోవడానికి సహాయపడతాయి.

నామేశ్వర దేవాలయం

సూర్యాపేట జిల్లా లో పిల్లలమర్రిలో ఉంది మూసి నది ఒడ్డులో ఉన్నాయి దేవాలయాన్ని, సా. శ.1202 లో ఈ ప్రాంతాన్ని పాలించిన శూద్ర కులంలోని రేచర్ల కుటుంబానికి చెందిన నామిరెడ్డి నిర్మించాడు వీరు కాకతీయుల భూస్వాములుగా పనిచేశారు.

రెండవ సహస్రప్తి తొలినాళ్లలో కాకతీయుల కాలంలో ఒక ప్రధాన నగరం గా విలసిల్లిన పిల్లలమర్రి గ్రామంలో ఈ దేవాలయం ఒకటి. ఎఱకేశ్వర, త్రికూటేశ్వర ,చెన్నకేశవ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి.

## నామేశ్వర ఆలయ నిర్మాణ చరిత్ర

కాకతీయ రాజు గణపతిదేవుడి పరిపాలనా కాలంలో రేచర్ల నామిరెడ్డి ప్రస్తుతం పిల్లలమర్రి గ్రామం ఉన్న ప్రాంతానికి సామంతరాజుగా ఉండేవారు. వీరు శైవారాధికులు కావడంతో 11వ శతాబ్దంలో మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఆయన పేరు మీద పార్వతీ మహాదేవ నామేశ్వర దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడి శివలింగాలు బ్రహ్మసూత్రం కలిగి ఉండటం విశేషం. కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయాలకు మాత్రమే ఈ బ్రహ్మసూత్రం ఉంటుంది.

ఎఱకేశ్వర దేవాలయం, పిల్లలమర్రి గ్రామానికి పశ్చిమ వైపున్న ఒక శివాలయం. మూసీ నది ఒడ్డున ఉన్న ఈ దేవాలయాన్ని సా.శ 1208లో కాకతీయులకు సామంతులైన రేచర్ల కుటుంబానికి చెందిన బాటిరెడ్డి భార్య ఎఱకసాని నిర్మించినట్లు ఇక్కడున్నా ఒక శాసనములో పేర్కొనబడింది. అందువల్ల ఇక్కడి దేవుడికి ఎఱకేశ్వరుడు అనే పేరు పెట్టారు. ప్రారంభంలో అల్లావుద్దీన్ ఖిల్జీ దక్కన్ ప్రాంతంలో జరిపిన దాడుల సమయంలో ఈ ఆలయం ధ్వంసం చేయబడింది. ఆ తరువాత ముసునూరి నాయక రాజవంశానికి చెందిన కాపయ్య నాయకుడికి సేవలందిస్తున్న స్థానిక ఫ్యూడటరీ చీఫ్ ద్వారా ఎఱకేశ్వర స్వామిని తిరిగి స్థాపించినట్లు సా.శ 1357నాటి శాసనంలో పేర్కొనబడింది.

ఇక్కడి ప్రాంగణంలో దేవాలయ చరిత్ర, పిల్లలమర్రి గ్రామ చరిత్ర గురించి తెలుగులో రాతి శాసనాలు ఉన్నాయి. సా.శ 1195 -శాక. 1117నాటి శాసనంలో మొదటి ప్రతాపరుద్రుని పాలన గురించి, సా.శ 1208 - 1130 నాటి శాసనంలో గణపతిదేవుని పాలన గురించి ప్రస్తావించబడింది. పిల్లమర్రి గ్రామంలో రాతి చెక్కబడిన నాలుగు దేవాలయాలలో ఈ ఎఱకేశ్వర దేవాలయం ఒకటి. పిల్లలమర్రి గ్రామంలో రాతి, గ్రానైట్ చెక్కబడిన నాలుగు దేవాలయాలలో ఈ ఎఱకేశ్వర దేవాలయం మిగిలిన మూడు దేవాలయాలు పార్వతి-మహాదేవ నామేశ్వర దేవాలయం, త్రికూటేశ్వర ఆలయం, చెన్నకేశవ దేవాలయం ఈ దేవాలయానికి తూర్పున ఉన్నాయి.

## ఎఱకేశ్వర ఆలయం చరిత్ర

12వ శతాబ్దంలో రేచర్ల బేతిరెడ్డి నామేశ్వర ఆలయంలో పూజలు చేసి పరిసర ప్రాంతంలో సంచరిస్తుండగా.. వేటకు వచ్చిన ఎరుకల వ్యక్తి అక్కడ ఉన్న ఒకపెద్ద ఊడల మర్రిచెట్టు కింద సేద తీరుతున్నాడు. ఆ సమయంలో ఆ చెట్టు పైన ఉన్న పిట్టలు.. మరి కొన్నాళ్లకు ఈ చెట్టు కూలుతుందని దీని కింద అనంత నిధి నిక్షిప్తమై ఉందని మాట్లాడుకోవడాన్ని విన్నాడు. వీరు అడవిలో ఉండటం పక్షులతో సహవాసం కారణంగా ఆ మాటలు ఎరుకల వ్యక్తికి అర్థం కావడంతో వేటగాడు స్పందించాడు దీంతో ఆ పక్షులు ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చాలా పగిలి చూస్తాం అని శపిస్తాయి.

రేచర్ల సామంత రాజు చెప్పవలసిందిగా కోరగా శాప భయంతో వేటగాడు సంకోచిస్తుండగా చెప్పకుంటే మరణ శిక్ష విధిస్తానన్నాడు. చెప్పినా చెప్పకపోయినా ప్రాణం పోతుందని భావించిన వేటగాడు రాజును ఓ కోరిక కోరతాడు. తన పేరున ఆలయం నిర్మిస్తే పక్షులు మాట్లాడుకున్న విషయం చెబుతానని రాజుతో అంటాడు. అప్పుడు రాజు అందుకు అంగీకరిస్తాడు. దీంతో పక్షులు ఏం మాట్లాడుకున్నాయో రాజుకు వివరించి ఆ ఎరుకలివాడు మరణిస్తాడు. కొంతకాలానికి ఆ మర్రి చెట్టు కూలి అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది.

అందులో 7 కొప్పెర్ల నిధి, ఆనాటి కొలతల ప్రకారం బయటపడుతుంది. ధనంతో ఎరకేశ్వర ఆలయం నిర్మించారు. దానికి ఎరుకల వాని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే దీనికి మరో వృత్తాంతం కూడా ప్రచారంలో ఉంది. రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ ఆలయం నిర్మించిందని ఆమె పేరు మీద ఎఱకేశ్వరాలయం పేరు వచ్చిందని కొందరి విశ్వాసం. ఆలయ నిర్మాణానికి ముందు ఇక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్టు ఊడలు పోసుకొని పెద్దగా విస్తరించడంతో ఈ గ్రామానికి పిల్లలమర్రి అని పేరు.

## ఆలయ నిర్మాణ శైలి శిల్పకళా సౌందర్యం:



నామేశ్వర ఆలయాన్ని చతురస్రాకారంలో, ఎరకేశ్వరాలయాన్ని శ్రీచక్రం ఆకారంలో రాతితో నిర్మించారు. ఇవి కాకతీయుల కాలం నాటి సంస్కృతిని, శిల్పసంపదను అంతరాలయం ప్రతిబింబిస్తున్నాయి. గర్భాలయం, తోరణాలు నల్లని (క్రిష్ణశిల) ఏకశిలతో నిర్మించడం విశేషం. ఈ ఆలయాల్లో శివలింగం ఎదురుగా నందీశ్వరుడు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కడా లేని విధంగా నందిని ఆలయంపైన గోపురం ముందు ప్రతిష్టించారు.

రేచర్ల రాజులు నాట్య కళాప్రియులు కావడంతో ఆలయాల్లో గర్భగుడి ఎదురుగా నందీశ్వరునికి బదులుగా నాట్యమండపం నిర్మించారు. నాట్యమండపం నిర్మాణ ఏర్పాటు చేసిన స్తంభాలపై చెక్కిన నాట్య శిల్పకళా రూపాలు సౌందర్యవంతంగా దర్శనమిస్తున్నాయి. ఈ స్తంభాల నుంచి సప్తస్వరాలు వినిపించేలా నిర్మించడం విశేషం.

## బ్రహ్మసూత్రంతో శివలింగం

సాధారణంగా అన్ని శివలింగాల మీద గీత ఉండదు కేవలం కాకతీయుల కాలంలో నిర్మించిన కొన్ని శివలింగాలకు మాత్రమే బ్రహ్మసూత్రం అనే గీత ఉంటుంది. బ్రహ్మసూత్రం ఉన్న ఆలయంలో ఒక్కసారి రుద్రాభిషేకం, జపం, ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహిస్తే కోటి సార్లు చేసిన పుణ్యఫలం లభిస్తుందని, ఇలాంటి శివలింగాన్ని దర్శిస్తే జన్మ ధన్యమవుతుందని భక్తుల నమ్మకం.

## త్రికూటేశ్వరాలయం..

త్రికూటేశ్వరాలయం, సరస్వతీదేవి సమేత బ్రహ్మ దేవాలయాలను రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ నామేశ్వర దేవాలయం ప్రాంగణంలోనే నిర్మించారు. త్రికుటేశ్వరాలయంలో మూడు శివలింగాలు ఉంటే నందీశ్వరునితో ప్రతిష్టించారు. ఇక్కడి నంది ఉత్తరం వైపుగా తలతిప్పి ఉంటుంది. ఎడమ కన్నుతో దక్షిణ, పడమర ఆలయంవైపు కుడి కన్నుతో ఉత్తరం వైపు ఉన్న ఆలయాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. అన్ని శివాలయాలలో ప్రాణమట్టాలు ఉత్తరంవైపుగా ఉంటాయి. కానీ ఈ త్రికుటేశ్వరాలయంలో మాత్రం ఎదురుగా ఉన్న ఆలయంలో ఉత్తరం వైపు, ఉత్తరం, దక్షిణం వైపు ఉన్న ఆలయాల్లో మాత్రం తూర్పువైపుగా ప్రాణమట్టాలు ఉన్నాయి.

## ప్రపంచంలోఈ విగ్రహం ఒక్కటే:

సరస్వతీదేవి సమేత బ్రహ్మ ఆలయంలో నెమలి వాహనంపై బ్రహ్మ సరస్వతీదేవి ఏకశిలపై ఒకే విగ్రహంగా దర్శనమిస్తారు. ప్రపంచంలో ఇలాంటి విగ్రహం ఇది ఒక్కటి మాత్రమే ఉండటం విశేషం. కవి పిల్లలమర్రి పినవీరభద్రుడు అమ్మవారిని దర్శించి కటాక్షం పొంది కవిగా ప్రసిద్ధి చెందాడని నానుడి. పిల్లలమర్రి గ్రామంలో పురాతన శ్రీచెన్నకేశవసా ఆలయం, హనుమ ఆలయాలు కూడా ఉన్నాయి.

## ధ్వంసమైన కళారూపాలు

వందల ఏళ్ల కిందట వచ్చిన అతిపెద్ద భూకంపం వల్ల శివలింగాలు ఉత్తరం వైపుగా ఒరిగాయి. ఆలయాలు కదలడంలో ఆలయ ప్రాకారాలు పైకప్పు జరిగిన ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయి. నామేశ్వరాలయం నుంచి సూర్యాపేట బర్లపెంట బజార్ లోని శ్రీఅన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయం వరకు సొరంగ మార్గం ఉంది. భూకంపం ప్రభావంతో కాలక్రమేణా పూర్తిగా పూడిపోయింది. పిల్లలమర్రి గ్రామంలో ఉన్న విఘ్నేశ్వరాలయం కాలగర్భంలో కలిసిపోయింది.

ఈ ఆలయాలు సూర్యాపేటకు ఆనుకొని ఉండటం విజయవాడ జాతీయ రహదారికి చెరువులో ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ మంచినీటి బావులకు ప్రత్యేక స్థానం ఉంది 11వ శతాబ్దంలో రేచర్ల రాజులు పావులు తవ్వించారు నాటి నుంచి నేటి వరకు అదే నీటితో అభిషేకాలు చేస్తున్నారు కరువులోనూ ఈ బావులు ఎండకపోగా గ్రామస్తులు రైతులు ఈ నీటిని తోడిన మళ్లీ అదే స్థాయిలోకి నీరు ఉండటం విశేషం కరువుకాలంలో పక్కన ఉన్న మూసి నది చెరువులో అడుగంటిన ఈ బావి నీటిమట్టం తగ్గకపోవడం విశేషం

## నిర్మాణ శైలి

ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కోట గుళ్ళు దేవాలయం, కాకతీయ శకంలోని ఇతర దేవాలయాల నిర్మాణ శైలిని పోలినట్లుగా ఈ దేవాలయ నిర్మాణ శైలి ఉంటుంది. ఈ దేవాలయం ఒక ఉపపీఠంపై ఉంచబడి, శిలువ ఆకారంలో ఉంటుంది. దీనికి తూర్పు, ఉత్తర, దక్షిణాలలో మూడు వరండాలు, పశ్చిమాన గర్భాలయం ఉన్నాయి. శిఖర గర్భగుడిని ఇటుక, సున్నంతో తయారు చేశారు. ఈ దేవాలయ నిర్మాణంలో ఉపయోగించిన రాయి ఆసక్తికరమైన ధ్వని లక్షణాలను కలిగి ఉందని చెప్పబడింది. గుడి రాయిని నాణెంతో తట్టినప్పుడు, అది లోహంలా శబ్దాన్ని చేస్తున్నట్టు అనిపిస్తుంది. దేవాలయంలో స్తంభాలు, గోడలు చెక్కబడ్డాయి. గోడలు పెయింట్ చేయబడ్డాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

## గురుకుల విద్యాలయాల్లో
# ప్రవేశాలకు ఆహ్వానం



**నవతరం-గార**

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, 6,7,8 తరగతులలో మిగిలివున్న ఖాళీల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవలసిందిగా గార మండలం వమరవల్లి గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు వై. చిట్టితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ హెచ్.ఎం.డి ఉబేదుల్లా తెలియజేశారని ఆమె తెలియజేశారు. గురుకులాల్లో చేరే విద్యార్థులు మార్చి 31 లోగా ఆన్ లైన్ లో https://aprs.apcfss.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24 వ తేదిన జరుగుతుందన్నారు.

## 281 మంది విద్యార్థులకు
# పరీక్ష సామాగ్రి పంపిణీ



**నవతరం-సంతబొమ్మాళి**

సంతబొమ్మాళి మండలం లో నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతబొమ్మాళి కే.జీ.బీ.వి , దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కోటబొమ్మాళి కేజీబీవి పాఠశాలలో అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న 281 మంది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ప్రతి విద్యార్థికి ప్లాంక్,పెన్, పెన్సిల్ పంపిణీ కార్యక్రమం చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు.

టెక్కలి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో సుమారు1500 మందికి స్టేషనరీ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. మా అభయం యువజన సేవా సంఘం పై నమ్మకంతో ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దాతలందరికీ అభయం యువజన సేవా సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, అద్దాల వీరభద్రాచారి పాల్గొన్నారు.

# విద్యార్థులకు జాతీయ స్థాయిలో పతకాలు

### ఇద్దరికి బంగారు, ముగ్గురికి వెండి, 25 మందికి ప్రశంసాపత్రాలు



**నవతరం-శ్రీకాకుళం రూరల్**

శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఇప్పిలి మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు విజయవాడలో నిర్వహించిన 13వ ఆల్ ఇండియా చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. ఐదో తరగతి విద్యార్థులు పాండ్రంకి వేదశ్రీ, సోనా దేవరాజులు బంగారు పతకాలు సాధించగా, మూడో తరగతి విద్యార్థులు బర్ల దుర్గాప్రసాద్, ఎదూరు అమరేంద్ర మరియు నాలుగో తరగతి విద్యార్థి వంశీ వెండి పతకాలు అందుకున్నారు అని ప్రధానోపాధ్యాయులు మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పిలి పాఠశాల నుంచి మొత్తం 25 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా వారందరికీ ప్రశంసాపత్రాలు లభించాయి. ఈ విజయంపై మండల విద్యాశాఖ అధికారులు పి.సుజాత, ఎన్.కృష్ణ, గ్రామ సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీ ప్రతినిధి ఇప్పిలి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పద్మిని, చంద్రకళ, రోజా, అనురాధ అభినందనలు తెలియజేశారు.

## 8న రాష్ట్ర స్థాయి ఉగాది
# పురస్కారాల ప్రధానం

- వివిధ రంగాల ప్రముఖులకు బిరుదులతో సత్కారం
- జిల్లా గ్రంథాలయ సంస్థలో కార్యక్రమం

**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక మణిపాత్రుని అకాడమీ (ఎం.సి.ఎ) ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహించే "ఉదయభాస్కర్ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం" ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్షురాలు మణిపాత్రుని భాగ్యలక్ష్మి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ వివరాలు వెల్లడించారు.

సాహిత్యం, కళలు, సామాజిక సేవ, విద్య తదితర రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ సందర్భంగా గుర్తించి బిరుదులతో పాటు "ఉదయభాస్కర్ ఉగాది పురస్కారాలు" అందజేస్తామని వారు తెలిపారు. సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం, వారి సేవలను గౌరవించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విశిష్ట అతిథిగా విశ్రాంత డి.ఇ.వో బలివాడ మల్లేశ్వరరావు హాజరవుతారు. గౌరవ అతిథులుగా శ్రీశ్రీ కళా వేదిక ఉత్తరాంధ్ర




అధ్యక్షులు డబ్బీరు గోవిందరావు, సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు, బాలరంజని సహాయ కార్యదర్శి వాడాడ శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రంథాలయ సంఘ సభ్యుడు ఐ.ఎన్.డి. ప్రసాదరావు పాల్గొననున్నారు. సాహిత్య, సాంస్కృతిక వర్గాల ప్రముఖులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు. ఆసక్తి గలవారంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# అనంతపురంలో సాహిత్య విమర్శ పాఠశాల



**నవతరం-శ్రీకాకుళం**

సాహిత్య విమర్శలో ప్రవేశం,ఆ ప్రక్రియ పట్ల ఆసక్తి ఉన్నవారి కోసం, అభ్యుదయ రచయితల సంఘం ఒక పాఠశాల నిర్వహిస్తుంది. ఏప్రిల్ 25,26 తేదీల్లో, అనంతపురంలో జరిగే ఈ పాఠశాలకు, ఇద్దరిని మాత్రమే ఎంపిక చేయాలని, రాష్ట్ర నాయకత్వం సూచించినట్టు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయేవారికి భోజన,వసతులు ఏర్పాటు చేస్తారన్నారు.ఆసక్తి ఉన్నవారు,80086 79666 నంబరును సంప్రదించాలని కోరారు.

## అచ్చెన్నాయుడిపై వైసీపీ రాద్ధాంతం
# దారి మళ్లింపు ప్రయత్నమే

- మంత్రి వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని విమర్శ
- ఏ మతాన్నీ కించపరచలేదని స్పష్టం
- తిరుపతి లడ్డూ అంశం నుంచి తప్పించుకునే యత్నమని ఆరోపణ
- శాసనసభ చర్చకు ముందుకు రావాలని సవాల్
- మతాలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదని వ్యాఖ్య
- ప్రజలు నిజాలను గమనిస్తున్నారని వెల్లడి
- ప్రజా బలం ముందు వైసీపీ ఆరోపణలు నిలవవని వ్యాఖ్య
- తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదారపు వెంకటేష్



**(నవతరం శ్రీకాకుళం)**

శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు, జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదారపు వెంకటేష్ వైసీపీ నేతలపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి వైసీపీ నేతలు రాజకీయ లాభం పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

తిరుపతి వెంకటేశ్వర స్వామివారి లడ్డూ కల్తీ అంశంపై కూటమి ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆ విషయాన్ని తప్పించుకునేందుకు వైసీపీ నేతలు వివిధ ఆరోపణలు చేస్తూ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని వెంకటేష్ అన్నారు. కోట్లాది మంది భక్తులకు పవిత్రమైన తిరుపతి లడ్డూ విషయంలో జరిగిన ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు.

శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఎవరినీ, ఏ మతాన్నీ అవమానించేలా మాట్లాడలేదని, ప్రతి ఒక్కరి మత విశ్వాసాలను గౌరవించాలని మాత్రమే ఆయన పేర్కొన్నారని తెలిపారు. ఆ వ్యాఖ్యలను వక్రీకరించి వివాదం సృష్టించడం సరికాదన్నారు.

ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సమయంలో మతాల పేరుతో రాజకీయాలు చేయడం తగదని వెంకటేష్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, నిజాయితీ రాజకీయాలకే ప్రజలు మద్దతు ఇస్తారని ఆయన పేర్కొన్నారు.జిల్లాలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో వారు ప్రజాహృదయ నేతలుగా నిలుస్తున్నారని వెంకటేష్ పేర్కొన్నారు.

అచ్చెన్నాయుడిపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు ప్రజా బలం ముందు నిలవవని, రాజకీయ లాభాల కోసం మతాలను ఉపయోగించడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

# ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 702 మంది హాజరు

**నవతరం-శ్రీకాకుళం**

జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు (తెలుగు, హిందీ) ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి పి. రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 06 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మాస్ కాపీయింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా 02 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 06 సిట్టింగ్ స్క్వాడ్లతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిందని ఆయన వివరించారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 929 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 702 మంది పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు. మిగిలిన 227 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలియజేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**